సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 17 । మార్చి । 2023



కిలో టమాట రూ.15
అనంతపురం కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.15, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.8 ప్రకారం పలికినట్లు అధికారులు తెలిపారు.



టన్ను చీనీ రూ.35 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.35 వేల ధర పలికాయి. మార్కెట్‌కు 586 టన్నులు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
36.9°/17.5°
జిల్లా అంతటా గురువారం వాతావరణం మారింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గాలివేగం స్వల్పంగా పెరిగింది. గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

632 మంది గైర్హాజరు

ప్రశాంతి నిలయం: ఉమ్మడి జిల్లాలో గురువారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం సంస్కృతం, తెలుగు, హిందీ, ఉర్దూ పరీక్షలకు 632 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 99 కేంద్రాల్లో 29,788 మంది విద్యార్థులకు గాను 29,156 మంది హాజరయ్యారు. వీరిలో జనరల్ విద్యార్థులు 27,203 మందికి గాను 26,663 మంది హాజరు కాగా, ఒకేషన్ విద్యార్థులు 2,585 మందికి గాను 2,493 మంది హాజరయ్యారు. 20 చోట్ల సిట్టింగ్ స్క్వాడ్ పరీక్షల తీరును పరిశీలించింది. అలాగే రాష్ట్ర పరిశీలకులు, ఆర్ఐఓ, డీఈఓలు, 5 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 69 కేంద్రాలను పరిశీలించారు.

ఆరుగురు విద్యార్థుల డీబార్


చున్నీలో ఫార్ములాలు రాసుకొచ్చిన విద్యార్థిని

అనంతపురం: ఎస్కే యూనివర్సిటీ పరిధిలో గురువారం నిర్వహించిన మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఆరుగురిని డీబార్ చేసినట్లు ఎస్కే యూనివర్సిటీ పరీక్షల విభాగం సంచాలకులు ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. అనంతపురంలో ఇద్దరు, కదిరిలో ఇద్దరు, గుత్తిలో ఇద్దరిని డీబార్ అయినట్లు వెల్లడించారు. పరీక్షల్లో మాస్‌కాపీయింగ్ కోసం విద్యార్థినులు తమ చున్నీల్లో కాపీయింగ్ మెటీరియల్‌ను రాసుకొచ్చి కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించి ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

హెచ్‌ఎం ఆదినారాయణ అరెస్టు

తనకల్లు: మండల పరిధిలోని నల్లగుట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఆదినారాయణను గురువారం కొక్కంటిక్రాస్‌లో పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక ఎస్ఐ రాంభూపాల్ వివరాల ప్రకారం.... హెచ్‌ఎం ఆదినారాయణ తమతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని పాఠశాల విద్యార్థినులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ మీనాక్షి ఈ నెల 6న పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థినులను ప్రత్యేకంగా విచారణ చేశారు. ఆదినారాయణ బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు విచారణలో తేలడంతో 9న అతన్ని సస్పెండ్ చేశారు. డీఈఓ ఆదేశాల మేరకు ఆదినారాయణపై ఎంఈఓ లలితమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఆదినారాయణ పరారీలో ఉన్నారు. తాజాగా కొక్కంటిక్రాస్‌లోని అమడగూరు రోడ్డులో ఉన్నట్లు పక్కా సమాచారం అందడంతో పోలీసులు అతన్ని అరెస్టు చేశారు.

మృతదేహంతో ఆందోళన


రమాదేవి (ఫైల్)

కదిరి టౌన్: కదిరి మున్సిపాలిటీ పరిధిలోని పార్థసారథి కాలనీలో మృతదేహంతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. వారి వివరాల మేరకు... పార్థసారథి కాలనీలో కాపురం ఉంటున్న రమాదేవి అనే మహిళ భర్త ఆరు నెలల క్రితం మృతి చెందారు. అదే కాలనీకే చెందిన శేఖర్ అనే వ్యక్తి రమాదేవితో వివాహేతర సంబంధం పెట్టుకున్నారు. అయితే నాలుగు నెలల క్రితం ప్రియుడు శేఖర్‌తో కలసి రమాదేవి పరారైనట్లు కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్‌లో శేఖర్, రమాదేవి సహజీవనం చేస్తున్నారు. అయితే రెండు రోజుల క్రితం రమాదేవి గాయాలతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చేరింది. శేఖర్... రమాదేవి కుటుంబ సభ్యులకు ఈ విషయాన్ని చేరవేసి అక్కడి నుంచి పరారయ్యాడు. ఆమెను చంపేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాడంటూ బంధువులు రమాదేవి మృతదేహంతో శేఖర్ ఇంటి ముందు ఆందోళన చేపట్టారు. అయితే పెద్దల సమక్షంలో ఇరువర్గాల వారినీ రాజీ చేసినట్లు తెలిసింది.

క్రీడా స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి టౌన్: నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్పోర్ట్స్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తోందని జిల్లా క్రీడా సాధికార సంస్థ అధికారి జగన్నాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 250 మందికి ఈ క్రీడా స్కాలర్‌షిప్‌లను మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. వివిధ క్రీడా విభాగాల నుంచి జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన యువతీ, యువకులకు రూ. 15 వేల నుంచి రూ.30 వేల వరకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తారన్నారు. దరఖాస్తుదారులు భారతీయ పౌరులైన 14 -25 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. అర్హత గల సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులు htttp:sportssholarship. ongc. co. in అనే వెబ్‌సైట్‌లో ఈనెల 27 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ విజయఢంకా

- పార్టీ ఉపాధ్యాయ అభ్యర్థి రామచంద్రారెడ్డి ఘన విజయం
- లెక్కింపు ప్రారంభం నుంచే దూసుకెళ్లిన వైనం
- రాత్రి 2 గంటలకు వీడిన ఉత్కంఠ
- కొనసాగుతున్న పట్టభద్రుల ఓట్ల కౌంటింగ్
- అధికార పార్టీ అభ్యర్థి 'వెన్నపూస' వైపే ఓటరు మొగ్గు!
- ఫలితం నేడు తేలే అవకాశం


రామచంద్రారెడ్డి విజయదరహాసం


ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది

సాక్షి ప్రతినిధి, అనంతపురం/అర్బన్: పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలు) ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించింది. పార్టీ అభ్యర్థి రామచంద్రారెడ్డి ఘన విజయం సాధించారు. గురువారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కాగా, ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యత కనబరుస్తూ వచ్చారు. అర్ధరాత్రి 2 గంటలకు ప్రక్రియ ముగియగా, రామచంద్రారెడ్డి విజయం సొంతం చేసుకున్నారు.

ఆధిక్యంలో 'వెన్నపూస'

పట్టభద్రుల స్థానం నుంచి వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసిన వెన్నపూస రవీంద్రారెడ్డి కూడా ఆధిక్యంలో కొనసాగుతున్నారు. అర్ధరాత్రి 2 గంటల సమయానికి రెండు రౌండ్ల ఫలితాలు పూర్తికాగా వెన్నపూస రవీంద్రారెడ్డి 19,519 ఓట్లతో కొనసాగుతున్నారు. టీడీపీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి 17652 ఓట్లతో రెండో స్థానంలో ఉన్నారు. పూర్తి ఫలితం శుక్రవారం సాయంత్రానికి వచ్చే అవకాశం ఉంది.

పోలింగ్ శాతం పెరగడంతోనే..

యాభై శాతం ఓట్లకు పైగా ఒక్క అభ్యర్థికీ రాకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు చేపట్టారు. అందువల్లే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితం అర్ధరాత్రి తర్వాత వెలువడింది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా భారీగా పోలింగ్ శాతం నమోదు కావడంతో కౌంటింగ్ ఆలస్యమైంది. ఇక.. పట్టభద్రుల ఎన్నికల్లో ఎక్కువ మంది బరిలో ఉండటం, పోలింగ్ శాతం పెరగడం వల్ల ఓట్ల లెక్కింపు జాప్యం జరుగుతోంది. ఓట్ల లెక్కింపులో మూడు షిఫ్టులలో సిబ్బంది పనిచేస్తున్నారు. ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు, కలెక్టర్‌తో పాటు పలువురు రెవెన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బంది విధుల్లో ఉన్నారు.

కలెక్టర్ ఆధ్వర్యంలో కౌంటింగ్


మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, చిత్రంలో ఎస్పీ

స్థానిక జేఎన్‌టీయూ అనంతపురంలో ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైంది. కార్యక్రమాన్ని కలెక్టర్, జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి ఆధ్వర్యంలో ప్రారంభించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి 388 బ్యాలెట్ పెట్టెలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 175 బ్యాలెట్ పెట్టెల్లోని ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. బ్యాలెట్ పెట్టెలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ సమక్షంలో అధికారులు తెరిచారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ల పెట్టెలను కేంద్రానికి తరలించారు. వాటిని సిబ్బంది కట్టలుగా కట్టి ప్రాథమిక లెక్కింపు చేపట్టారు. బ్యాలెట్ పెట్టెలను కౌంటింగ్ కేంద్రంలోకి టేబుల్ వారీగా తరలించారు. పెట్టెలను ఎన్నికల పరిశీలకులు హరిజవహర్ లాల్ తనిఖీ చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించిన అనంతరం కౌంటింగ్ సిబ్బందిని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. విధుల్లో ఉన్నవారు ఒత్తిడికి గురికావద్దని చెప్పారు. నిర్లక్ష్యంగా ఉండకుండా అప్రమత్తంగా బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. చిన్న సందేహం వచ్చినా టేబుల్ ఇన్‌చార్జ్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఎస్పీ ఫకీరప్ప కాగినెల్లి, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, డీఆర్ఓ గాయత్రిదేవి పాల్గొన్నారు.

ఆది నుంచే ఆధిక్యత

కౌంటింగ్ ప్రారంభం నుంచే పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి పూర్తి ఆధిక్యత కనబరిచారు. తొలి రౌండ్‌లో 4,756 ఓట్లతో తొలి స్థానం సాధించిన ఆయన రెండో స్థానంలో నిలిచిన ఒంటేరు శ్రీనివాసరెడ్డిపై 1,213 ఓట్ల ఆధిక్యంలో నిలిచారు. ఇక.. రెండో రౌండ్‌లోను ఆధిక్యతను నిలబెట్టుకున్న రామచంద్రారెడ్డి 4,090 ఓట్లను సాధించారు. 780 ఓట్లతో ముందంజలో నిలిచారు. మొత్తం రెండు రౌండ్లలో 8,846 ఓట్లను సాధించి మొత్తం 1,993 ఓట్ల ఆధిక్యత సాధించారు. మొదటి ప్రాధాన్యత ఓట్లతో ఫలితం తేలకపోవడంతో అధికారులు రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించారు. ఈ క్రమంలో ఒక్కొక్కరూ ఎలిమినేట్ కాగా, చివరికి రామచంద్రారెడ్డి జయకేతనం ఎగురవేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో...	
పట్టభద్రుల ఓట్లు	3,30,124
పోలైన ఓట్లు	2,45,576
బ్యాలెట్ పెట్టెలు	388
లెక్కింపు టేబుళ్లు	24
ఉపాధ్యాయుల ఓట్లు	28,148
పోలైన ఓట్లు	25,887
బ్యాలెట్ పెట్టెలు	175
లెక్కింపు టేబుళ్లు	14

పట్టభద్రుల ఓట్ల కౌంటింగ్ ఫలితాలు ఇలా..(అర్ధరాత్రి 2గంటలకు)	
వెన్నపూస రవీంద్రారెడ్డి (వైఎస్సార్ సీపీ)	19,519
భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి (టీడీపీ)	17,652
పోతుల నాగరాజు (పీడీఎఫ్)	3,552
నగరూరు రాఘవేంద్ర (బీజేపీ)	1,459

'అమరజీవి'కి ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్, ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్

పుట్టపర్తి అర్బన్: ఆధునిక కాలానికి శిబి చక్రవర్తి లాంటివారు అమరజీవి పొట్టి శ్రీరాములు అని కలెక్టర్ బసంత్‌కుమార్ కొనియాడారు. గురువారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశం మందిరంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి 1952 డిసెంబర్ 15న అమరులయ్యారన్నారు. ఆయన త్యాగ ఫలితంగానే 1956 నవంబర్ 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఎన్నో ఉద్యమాలు చేపట్టి జైలు జీవితం గడిపిన మహనీయుడు పొట్టి శ్రీరాములన్నారు. మహనీయుల జీవిత విశేషాల నుంచి స్ఫూర్తి పొంది యువత సన్మార్గంలో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఏపీ టూరిజం అధికారి ప్రతాప్‌రెడ్డి, ఏఓ వెంకటనారాయణ, తహసీల్దార్ అనుపమ, డీటీ మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆధ్వర్యంలో పలువురు పోలీస్ అధికారులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణలో పొట్టి శ్రీరాములు పాత్ర ఎంతో గొప్పదన్నారు. ఆయన మనందరికీ ఆదర్శమూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామకృష్ణప్రసాద్, ఎస్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఓ సుజాత, ఎస్‌బి సీఐ రవీందర్‌రెడ్డి, ఏఆర్ అడ్మిన్ ఆర్ఐ టైటాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏప్రిల్ 4 నుంచి పీజీ మూడో సెమిస్టర్

అనంతపురం: ఎస్కేయూ పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 4 నుంచి మొదలవుతాయని ఎస్కేయూ పరీక్షల విభాగం సంచాలకులు ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. మొదటి సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 6 నుంచి ప్రారంభమవుతాయన్నారు.

వైభవంగా పుష్పయాగోత్సవం


అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత నారసింహుడు


పూజ కోసం తెచ్చిన వివిధ రకాల పుష్పాలు

- ముగిసిన ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు

కదిరి: పక్షం రోజుల పాటు సాగిన ఖాద్రీ లక్ష్మీ నారసింహుని బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి ఆలయ ప్రాంగణంలో జరిగిన పుష్పయాగోత్సవంతో ముగిశాయి. ఈ ఉత్సవం అత్యంత వైభవంగా సాగింది. శ్రీవారి బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా సాగేందుకు సహకరించిన అష్ట దిక్పాలకులు, పంచ భూతాలు, దేవతా మూర్తులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారిని.. వారి వారి లోకాలకు సాగనంపేందుకు నిర్వహించేదే ఈ పుష్పయాగోత్సవమని ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు. తీర్థవాది ఉత్సవం ముగియగానే బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి ఆలయం తలుపులు మూసివేసిన విషయం తెలిసిందే. తిరిగి గురువారం వేకువజామునే ఆలయ ద్వారాలు తెరిచి మహా సంప్రోక్షణ చేశారు. అనంతరం స్వామివారికి నిత్య పూజాది కై ంకర్యాలను నిర్వహించిన తర్వాత భక్తులకు ఆలయంలో శ్రీవారి సర్వ దర్శన భాగ్యం కలిగించారు. రాత్రి సమయంలో రంగ మండపంలో శ్రీదేవి, భూదేవిల సమేత శ్రీవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఈ ఉత్సవానికి ఉభయ దారులుగా రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పూల అశ్వర్థనారాయణ కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఆలయ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ పట్టెం గురుప్రసాద్ తెలిపారు.

హుండీ ఆదాయం రూ.77.69 లక్షలు

బ్రహ్మోత్సవాల్లో ఖాద్రీశుడికి హుండీ ద్వారా రూ77,69,033 ఆదాయం వచ్చింది. దీంతో పాటు 92 గ్రాముల బంగారం, 3 కిలోల వెండి, అలాగే 12 దేశాలకు సంబంధించిన విదేశీ కరెన్సీ కూడా స్వామి వారికి భక్తులు హుండీ ద్వారా సమర్పించారు. గురువారం ఆలయంలోని హుండీలను లెక్కించారు.


చిన్న పరిశ్రమలకు ఊతం

- నిరుద్యోగులకు అండగా 'ప్రధాన మంత్రి ఉద్యోగ కల్పన'
- సమర్థవంతంగా అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న యువత

పుట్టపర్తి: 'ప్రధాన మంత్రి ఉద్యోగ కల్పన' పథకం చిన్న పరిశ్రమలకు ఊతమిస్తోంది. పీఎంఈజీపీ కింద కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులకు రూ.50 లక్షల దాకా రుణాన్ని సబ్సిడీపై అందజేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా సమర్థవంతంగా ఈ పథకాన్ని అమలు చేస్తుండటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

సబ్సిడీతో చేయూత

జిల్లా పరిశ్రమల కేంద్రం, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు, ఖాదీ ఇండస్ట్రీస్ పరిశ్రమల ద్వారా యువతకు సబ్సిడీ రుణాలు అందించి పరిశ్రమల స్థాపనకు శ్రీకారం చుట్టాయి. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీమ్ కింద పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న యువతకు గరిష్టంగా రూ.50 లక్షలు, కనిష్టంగా రూ.20 లక్షలు సబ్సిడీ కింద రుణాలను మంజూరు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో 35 శాతం, పట్టణ ప్రాంతాలలో 25 శాతం సబ్సిడీతో రుణాలు అందిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, విశ్రాంత ఆర్మీ సిబ్బందికి గ్రామీణ ప్రాంతాలలో 35 శాతం , అర్బన్ ప్రాంతాలలో 25 శాతం సబ్సిడీ ఇస్తున్నారు.




చిత్రంలో కనిపిస్తున్న యువతి పేరు గీత. ఆమె హిందూపురం ప్రాంతానికి చెందిన వారు. పీఎంఈజీపీ కింద రెండు కరెంటు మగ్గాలను ప్రారంభించారు. బ్యాంకు రుణం రూ.19 లక్షలు మంజూరైంది. మార్జిన్ మనీ కింద గీత రూ.లక్ష చెల్లించారు. మొత్తంగా రూ.7.50 లక్షల సబ్సిడీ లభించింది. ఆమె ఉపాధి పొందడంతో పాటు మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నారు. రోజుకు రూ.వెయ్యికి పైగా ఆదాయం లభిస్తోందని, తమ కుటుంబ కష్టాలు తీరాయని గీత హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇక్కడ కనిపిస్తున్న యువకుడి పేరు గట్టు భాగ్యరాజ్. వీరిది ధర్మవరంలోని సాయినగర్. నిరుద్యోగి అయిన భాగ్యరాజ్ కరెంటు మగ్గాలతో ఉపాధి పొందాలని భావించారు. ఇందులో భాగంగానే పీఎంఈజీపీకి దరఖాస్తు చేసుకున్నాడు. బ్యాంకు రూ.8.50 లక్షల రుణం మంజూరు చేసింది. మార్జిన్ మనీ కింద భాగ్యరాజ్ రూ.50 వేలు చెల్లించాడు. ప్రభుత్వం నుంచి సబ్సిడీ రూ.2.50 లక్షలు వచ్చింది. దీంతో భాగ్యరాజ్ రెండు కరెంటు మగ్గాలను నెలకొల్పాడు. దీనికి తోడు స్వంతంగా మరో రూ.10 లక్షలు వెచ్చించి మరో కరెంటు మగ్గాన్నీ ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం రోజుకు రూ.1500 పైగా ఆదాయం వస్తోందని భాగ్యరాజ్ తెలిపారు. ఆయన ఉపాధి పొందడంతో పాటు ప్రస్తుతం నలుగురికి ఉపాధి కల్పిస్తున్నారు. ఎప్పటికప్పుడు అధికారులు తగిన సలహాలు, సూచనలిచ్చి పథకం వర్తించేలా చేశారని భాగ్యరాజ్ తెలియజేశారు.




పీఎంఈజీపీ కింద ఏర్పాటు చేసుకున్న కరెంటు మగ్గం

అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నాం



పుట్టపర్తి కేంద్రంగా ఏర్పాటైన శ్రీ సత్యసాయి జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికే ఆ దిశగా ప్రభుత్వం విశాఖలో ఈ నెల 3, 4 తేదీల్లో ఏర్పాటు చేసిన గ్లోబల్ సమ్మిట్‌లో కేటాయింపులు జరిగాయి. పీఎంఈజీపీ కింద రాష్ట్ర ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తూ చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ఊతమిస్తోంది. తద్వారా యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. అన్ని విధాలా యువతను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– చాంద్‌బాషా, జిల్లా పరిశ్రమల మేనేజర్

2002-23లో నెలకొల్పిన యూనిట్ల వివరాలు ఇలా...		
ఏజెన్సీ పేరు	స్థాపించిన యూనిట్ల సంఖ్య	మంజూరైన మొత్తం రూ. లక్షల్లో..
జిల్లా పరిశ్రమల కేంద్రం	83	581.77
కేవీఐబీ (ఖాదీ బోర్డు)	11	33.61
కేవీఐసీ	04	19.5
మొత్తం	98	634.88

క్లుప్తంగా

పనితీరు మెరుగుపరచుకోండి

- రాష్ట్ర కుష్టు వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ దేవసాగర్

బత్తలపల్లి: పనితీరు మెరుగు పరుచుకోకపోతే తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుందని పీహెచ్‌సీ వైద్య సిబ్బందిని రాష్ట్ర కుష్టు వ్యాధి నియంత్రణ అధికారి (జేడీ) డాక్టర్ దేవసాగర్ హెచ్చరించారు. బత్తలపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. ఈ ఏడాది జనవరిలో జరిగిన ఎల్‌సీడీసీ సర్వే, గత 20 యేళ్లలో చికిత్స పొందిన వారి వివరాలు, అంగవైకల్యం బారిన పడిన వారికి అందజేసిన చికిత్సలపై ఆరా తీశారు. మండలంలోని కుష్టు వ్యాధిగ్రస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అయితే వీటికి పీహెచ్‌సీ సిబ్బంది వద్ద సరైన సమాధానాలు లేకపోవడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. పనితీరు మెరుగుపరుచుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ తిప్పయ్య, పీహెచ్‌సీ డాక్టర్ గంగిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఇంకెంత కాలం దగా చేస్తారు?

- మాజీ మంత్రి పరిటాల సునీతపై ఎమ్మెల్సీ మంగమ్మ ఫైర్
- వాల్మీకుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ పెద్ద పీట వేశారు
- ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ఏకసభ్య కమిటీ అధ్యయనం చేస్తోంది


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మంగమ్మ (చిత్రంలో) లిఖిత, హరిత, మంజుల తదితరులు

అనంతపురం క్రైం: 'గత టీడీపీ ప్రభుత్వంలో వాల్మీకులను ఎదగనివ్వకుండా తొక్కిపెట్టారు. కరుడు కట్టిన ఈ నిజాన్ని దాచి వాల్మీకులను జగన్ సర్కార్ పట్టించుకోవడం లేదంటూ మాజీ మంత్రి పరిటాల సునీత మాట్లాడడం విడ్డూరంగా ఉంది. ఇలాంటి అవాస్తవాలతో ఇంకెంత కాలం వాల్మీకులను దగా చేస్తారు? వాస్తవాలను మాట్లాడితే అందరూ హర్షిస్తారు. అలా కాదంటే ప్రజాగ్రహానికి గురి కావాల్సి ఉంటుంది' అని మాజీ మంత్రి పరిటాల సునీతపై ఎమ్మెల్సీ మంగమ్మ మండిపడ్డారు. వాల్మీకుల సంక్షేమాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ పరిటాల సునీత చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. గురువారం అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. తాము అధికారంలోకి రాగానే వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చేందుకు చర్యలు చేపడతామంటూ 2014 ఎన్నికలకు ముందు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు హామీనిచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి రాగానే వాల్మీకులకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అవసరమైన అన్ని చర్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారన్నారు. ఇందులో భాగంగానే సాధ్యాసాధ్యాల పరిశీలనకు ఐఏఎస్ విశ్రాంత అధికారి శామ్యూల్ ఆనంద్‌తో కూడిన ఏకసభ్య కమిటీని గుర్తు చేశారు. వాల్మీకుల అభ్యున్నతికి కృషి చేస్తున్న జగన్ సర్కార్‌పై అనవసరంగా నోరు పారేసుకోవడం మంచిది కాదని హితవు పలికారు.

▸▸ ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ మానుకింద లిఖిత మాట్లాడుతూ.. వాల్మీకుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందని, వాస్తవాలను వక్రీకరిస్తూ ఉనికి చాటుకునేందుకు వాల్మీకులను వాడుకోవాలనుకుంటే సహించబోమని హెచ్చరించారు. దశాబ్దాలుగా వాల్మీకులకు కలగా ఉన్న రాజ్యాధికారం సీఎం వైఎస్ జగనన్న పాలనలోనే నెరవేరిందన్నారు. నామినేటెడ్ పదవుల్లోనూ వాల్మీకులకు సముచిత స్థానం దక్కిందన్నారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఏడీసీసీ బ్యాంకే ఇందుకు నిదర్శనమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాతనే ఈ బ్యాంక్‌కు తొలిసారిగా వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన తన తండ్రి వీరాంజనేయులును చైర్మన్‌గా సీఎం జగనన్న నియమించారని, ఆ తర్వాత ఆ పదవిని తనకు ఇచ్చారని గుర్తు చేశారు. వాల్మీకులను ఓటు బ్యాంక్ రాజకీయాలకు తప్ప వారి అభ్యున్నతికి ఎలాంటి చర్యలూ చంద్రబాబు చేపట్టలేదన్నది అందరికీ తెలిసిన రహస్యమన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వాల్మీకుల సంక్షేమానికి చెప్పుకోదగ్గ ఏ ఒక్క కార్యక్రమాన్ని అమలు చేయని వారు నేడు కపట ప్రేమ చూపుతూ ముందుకు రావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశాన్ని అసెంబ్లీలో ఆమోదించడంతో పాటు చట్టబద్ధత కోసం పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ ఎం.మంజుల, రాష్ట్ర నాటక అకాడమి చైర్‌పర్సన్ హరిత, మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీదేవి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకురాళ్లు రాధాయాదవ్, భారతి, శోభాబాయి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తో ఎంపీ గోరంట్ల మాధవ్ భేటీ



హిందూపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. న్యూఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న సీఎం వైఎస్ జగన్‌ను ఆయన కలసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ

పెనుకొండ: స్థానిక గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పి.రమ గురువారం ఆకస్మిక తనిఖీ చేసారు. పలు రికార్డులు పరిశీలించారు. పుస్తకాల వివరాలు, పాఠకుల సంఖ్య తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటాన్ని ఉంచి పూలవేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మహబూబ్‌బాషా, పాఠకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలను కించపరుస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు

- టీడీపీ రాష్ట్ర కార్యాలయం వేదికగా అనైతిక చర్య
- స్థానిక నాయకులు, కార్యకర్తల ద్వారా వైరల్ చేయిస్తున్న వైనం
- ముగ్గురు టీడీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేసిన రూరల్ పోలీసులు

రాప్తాడు రూరల్: అధికార పార్టీ ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా కించపరుస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వైరల్ చేస్తున్న ముగ్గురు టీడీపీ కార్యకర్తలపై అనంతపురం రూరల్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వివరాలను సీఐ విజయభాస్కర్‌గౌడ్ గురువారం వెల్లడించారు. అనంతపురం మండలం సోములదొడ్డి గ్రామానికి చెందిన చల్లా రాఘవేంద్రనాయుడు, సిండికేట్‌నగర్‌కు చెందిన బత్తల మంజునాథ్, కట్టా లోకేష్... టీడీపీలో క్రియాశీలక కార్యకర్తలుగా చెలామణి అవుతున్నారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి విరుద్ధంగా వర్గ వైషమ్యాలను రెచ్చగొట్టేలా ఇటీవల టీడీపీ రాష్ట్ర కార్యాలయం వేదికగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన వివిధ పోస్టులను వీరు వైరల్ చేశారు. దీనిపై నందమూరినగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇర్ఫాన్‌బాషా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో చల్లా రాఘవేంద్రనాయుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. పార్టీలో చురుకుగా ఉన్న సోషల్ మీడియా కార్యకర్తలు, స్థానిక నాయకులు, కార్యకర్తల పేర్లు, ఫొటోలతో ఎమ్మెల్యేను కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తూ సిద్ధం చేసిన పోస్టులు తమకు 'టీంపోస్ట్' అనే డీపీ ఉన్న మొబైల్ నంబరు ద్వారా అందాయని, వీటిని టీడీపీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు వైరల్ చేస్తూ వచ్చామని నిందితుడు అంగీకరించాడు. రాఘవేంద్ర నాయుడు తెలిపిన మేరకు అతనితోపాటు బత్తల మంజునాథ్, కట్టా లోకేష్‌పై పోలీసులు కేసులు నమోదు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పోస్టులను వైరల్ చేస్తే శాంతిభద్రతల దృష్ట్యా వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని ఈ సందర్భంగా సీఐ విజయభాస్కర్‌గౌడ్ హెచ్చరించారు.

పన్ను చెల్లింపుదారులకు శుభవార్త !

ప్రశాంతి నిలయం: రాష్ట్ర వ్యాప్తంగా నగర పాలక సంస్థలు, పురపాలక సంస్థలలో పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇప్పటి వరకు చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీ జాగా పన్నులపై వడ్డీ రాయితీని కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వై.శ్రీలక్ష్మి జీఓ నంబర్ 34ను విడుదల చేశారు. ఈ నిర్ణయంతో జిల్లాలోని హిందూపురం, కదిరి, ధర్మవరం, పుట్టపర్తి, మడకశిర, పెనుకొండ మున్సిపాలిటీల పరిధిలోని పన్ను చెల్లింపుదారులకు మేలు జరగనుంది. పన్ను చెల్లింపుదారులు బకాయి మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరంతో సహా ఒకేసారి మార్చి 31లోగా చెల్లిస్తే వడ్డీ మినహాయింపు పొందవచ్చు. పన్ను చెల్లింపుదారుల ఆయా మున్సిపాలిటీ కార్యాలయాల్లోగాని, వార్డు సచివాలయాల్లో, ఆన్‌లైన్ ద్వారా లేదా నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లించవచ్చు.

మిద్దెపై నుంచి పడి యువకుడి మృతి

ముదిగుబ్బ: ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ముదిగుబ్బ మండలం పొదరాళ్లపల్లికి చెందిన శివకుమార్ (32) బుధవారం రాత్రి భోజనం ముగించుకున్న అనంతరం మిద్దెపైకెక్కి పడుకున్నారు. గురువారం తెల్లవారుజామున తల్లిదండ్రులు నిద్రలేచి బయటకు వచ్చి పరిసరాలు శుభ్రం చేసుకుంటుండగా... ఇంటి పక్కన శివకుమార్ విగతజీవిగా పడి ఉండడం గమనించారు. వెంటనే బంధువుల సాయంతో ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. నిద్రలో పక్కకు దొర్లినప్పుడు కిందపడి మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై పట్నం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

టెక్స్‌టైల్ పార్క్‌లో కొత్త యూనిట్ల ఏర్పాటుకు చర్యలు

- జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీ శ్రీరంగం అప్పాజి

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళం వద్ద ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ పార్క్‌లో కొత్త యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీ శ్రీరంగం అప్పాజి తెలిపారు. టెక్స్‌టైల్ పార్క్‌లో గురువారం ఆయన యూనిట్ ఏర్పాటు దారుల సమావేశంలో మాట్లాడారు. పార్క్‌లోని 55 ప్లాట్లను ఎనిమిదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం అర్హులను గుర్తించి కేటాయించినట్లు గుర్తు చేశారు. ఇందులో ఇప్పటి వరకూ కేవలం 7 యూనిట్లు మాత్రమే నెలకొల్పారన్నారు. మిగిలిన వారు ప్లాట్లలో భవనాలు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేకపోతే కనీసం వర్క్‌షెడ్లనైనా ఏర్పాటు చేసుకుని యూనిట్లు ప్రారంభించాలన్నారు. లేకపోతే అగ్రిమెంట్లను రద్దు చేసి, ఔత్సాహికులైన మరొకరికి ఆ ప్లాట్లు కేటాయిస్తామన్నారు. నైపుణ్యం కలిగిన కూలీలు లేకపోవడం, సకాలంలో రుణాలు మంజూరు చేయకుండా బ్యాంకర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, కరోనా విపత్కర పరిస్థితుల్లో వ్యాపారాలు దెబ్బతినడం తదితర కారణాలతో తాము యూనిట్లు ఏర్పాటు చేయలేకపోయామని, తమకు 6 నెలల గడువిస్తే యూనిట్ ఏర్పాట్లు ప్రారంభిస్తామంటూ ఈ సందర్భంగా ఏడీఏకు పలువురు విన్నవించారు.

నైపుణ్యాభివృద్ధికి చర్యలు : యూనిట్ ఏర్పాటుదారుల విన్నపానికి స్పందించిన ఏడీఏ మాట్లాడుతూ.. నైపుణ్యం కలిగిన మానవవనరులను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ఈ నెల 24 నుంచి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు భరోసానిచ్చారు. ఆసక్తి ఉన్న వారిని బ్యాచ్‌కు 30 మంది చొప్పున ఎంపిక శిక్షణ ఇప్పిస్తామన్నారు. అలాగే రుణాల మంజూరు విషయమై బ్యాంకర్లతో మాట్లాడి నిబంధనలు సరళీకృతం చేసేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ డీఓ బసవరాజు, ఏడీఓ మురళీమోహన్, స్థానిక టెక్స్‌టైల్ పార్క్ మేనేజర్ శివారెడ్డి, యూనిట్ ఏర్పాటు దారులు ప్రసాద్, చమ్మా ఇబ్రహీం, రవికుమార్ , ఇబ్రహీం ఖలీలుల్లా, భీమనపల్లి దివాకర్, రాము, కొండి ఇబ్రహీం, రాజశేఖర్, వెంకటేశులు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్

- నిందితుడు ధర్మవరం వాసి

బాగేపల్లి (కర్ణాటక): తాళం వేసిన ఇళ్లలో చొరబడి విలువైన బంగారు నగలు, నగదు అపహరించుకెళుతున్న ఓ యువకుడిని కర్ణాటకలోని బాగేపల్లి పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. నిందితుడిని శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన షేక్ ఖాజాపీర్‌గా గుర్తించారు. పెయింటింగ్ పనులతో జీవనం సాగించే ఖాజాపీర్.. పగలు వీధుల్లో సంచరిస్తూ తాళం వేసిన ఇళ్లను గుర్తించి, రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడేవాడు. ఈ ఏడాది జనవరిలో బాగేపల్లిలో ఉపాధ్యాయుడు మునిరాజు ఇంట్లోకి చొరబడి విలువైన వస్తువులు అపహరించుకెళ్లారు. ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో ఖాజాపీర్‌ను అరెస్టు చేసి రూ.12.50 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, వెండి సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

జూదరుల అరెస్ట్


హిందూపురం: స్థానిక ముదిరెడ్డిపల్లి శివారులో పంట పొలాల మధ్య గురువారం సాయంత్రం పేకాట ఆడుతున్న 27 మందిని స్పెషల్ పార్టీ పోలీసులు అరెస్ట్ చేసి, రూ.80,500, ఆరు ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ ఈరన్న తెలిపారు.

వివాహిత హత్య


హతురాలు సరస్వతి

హిందూపురం: డబ్బు విషయంగా చోటు చేసుకున్న ఘర్షణలో ఓ వివాహిత హతమైంది. పోలీసులు తెలిపిన మేరకు.. హిందూపురం మండలం కొటిపిలోని బసవేశ్వరకాలనీకి చెందిన సరస్వతి (38) తన భర్తను వదిలి ఇద్దరు కుమారులతో కలసి జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో ఆమెతో గౌరిబిదనూరు నివాసి అజీమ్ పరిచయం పెంచుకుని సహజీవనం సాగిస్తూ వచ్చాడు. వీరికీ ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో కొంత డబ్బును కుమార్తె పేరిట బ్యాంక్‌లో వేయాలంటూ అజీమ్‌ను సరస్వతి కోరింది. ఇందుకు అజీమ్ అంగీకరించలేదు. దీంతో ఇదే అంశంపై ఇద్దరూ రెండు రోజులుగా గొడవ పడుతూ వచ్చారు. గురువారం సాయంత్రం డబ్బు విషయంగా సరస్వతి గట్టిగా నిలదీసింది. దీంతో ఘర్షణ పడి ఇంటి నుంచి అజీమ్ బయటకు వచ్చాడు. వెనువెంటనే బయటకు వచ్చిన సరస్వతి.. అజీమ్‌ను పట్టుకునే ప్రయత్నం చేయడంతో అతను తోసేశాడు. దీంతో కిందపడిన ఆమె అపస్మారస్థితికి చేరుకుంది. కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న అజీమ్ అజ్ఞాతంలోకి వెళ్లాడు. సమాచారం అందుకున్న హిందూపురం రూరల్ సీఐ కృష్ణారెడ్డి అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆర్బీకే సేవలు వినియోగించుకోండి


మాట్లాడుతున్న ఏడీఏ విద్యావతి

తనకల్లు: రైతు భరోసా కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు జిల్లా రిసోర్స్ సెంటర్ ఏడీఏలు గుడిపల్లి విద్యావతి, సనావుల్లా సూచించారు. గురువారం తనకల్లులోని ఆర్బీకేలో వ్యవసాయ అనుబంధ సహాయకులు, రైతులతో వారు సమావేశమై మాట్లాడారు. ఉద్యాన, పట్టు, పశువైద్యం తదితర శాఖల సేవలన్నీ ఆర్బీకే వేదికగా అందజేస్తున్నట్లు వివరించారు. విత్తనం మొదలు పంట అమ్ముకునేంత వరకూ ప్రతి దశలోనూ అవసరమైన సేవలను ఆర్బీకే ద్వారా అందిపుచ్చుకోవచ్చునన్నారు. చిరుధాన్యాల సాగుకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలపై చైతన్య పరిచారు. కార్యక్రమంలో కదిరి వ్యవసాయ సహాయ సంచాలకులు సత్యనారాయణ, ఏఓ శ్రీహరినాయక్, ఏఈఓ నయాజ్ తదితరులు పాల్గొన్నారు.

'యువగళం'పై అనాసక్తి

- తమ్ముళ్ల నుంచి కనిపించని స్పందన
- నేడు జిల్లాలోకి నారా లోకేశ్ యువగళం
- జిల్లాలో 20 రోజుల పాటు సాగనున్న యాత్ర

పుట్టపర్తి టౌన్: మునిగిపోతున్న నావను ఒడ్డుకు చేర్చేందుకు టీడీపీ అధిష్టానం సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఇందులో భాగంగా మాట తీరు స్పష్టతలేని లోకేష్‌బాబుని యువగళం పేరుతో రంగంలో దింపింది. దీంతో ఈ ఖర్మ మాకెంటి బాబూ అంటూ ఓ వైపు టీడీపీ కేడర్ తలలు బాదుకుంటోంది. లోకేష్ పాదయాత్ర ఆరంభం నుంచి ఇదే తీరు వ్యక్తమవుతూ వచ్చింది. ఈ నేపథ్యంలోనే జిల్లా టీడీపీ నాయకుల విభేదాలు తారాస్థాయికి చేరుకున్న ప్రస్తుతం తరుణంలో లోకేష్ పాదయాత్ర జిల్లాలోకి శుక్రవారం ప్రవేశించనుంది. కదిరి నియోజకవర్గంలో ఈ నెల 17న పాదయాత్ర ప్రారంభమై నాలుగు రోజులు పాటు కొనసాగి 21న పుట్టపర్తి నియోజవకర్గం నల్లమాడలోకి ప్రవేశించనుంది. తర్వాత పెనుకొండ, రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల మీదుగా సుమారు 20 రోజుల పాటు జిల్లాలో పాదయాత్ర కొనసాగనుంది. పాదయాత్రను విజయవంతం చేయాలని పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడి నుంచి జిల్లా నేతలకు ఆదేశాలు అందాయి. ఈ క్రమంలో పుట్టపర్తిలో గురువారం కొందరు టీడీపీ నేతలు సమావేశం నిర్వహించగా.. పార్టీ కార్యకర్తల నుంచి స్పందన రాలేదు.

ఆసక్తి చూపని 'తమ్ముళ్లు'

నారా లోకేష్ యువగళం పాదయాత్రను హైలెట్ చేసేందుకు టీడీపీ నాయకులు పడరాని పాట్లు పడుతున్నారు. చినబాబు మెప్పు కోసం ఇతర పార్టీ నేతలను టీడీపీలో చేర్చే నాటకీయ పరిణామాలకు తెరతీసేందుకు కొందరు పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగా లోకేష్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకోవాలంటూ పలువురిని బతిమలాడుతున్నారు. సమీప గ్రామాల్లోకి పాదయాత్ర చేరుకోగానే పూలదండలు వేసి స్వాగతం పలకాలని బేరాలు పెడుతున్నారు. ఈ తీరును గమనించిన సొంత పార్టీ కార్యకర్తలు ఏవగించుకుంటున్నారు. మీకు, మీ పార్టీకో దండమంటూ పాదయాత్రలో పాల్గొనకుండా ముఖం చాటేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం.. 'తనకల్లు' వాసి మృతి


మృతుడు శంకర్

తనకల్లు: కర్ణాటకలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో తనకల్లు మండల వాసి మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని గందోడివారిపల్లికి చెందిన శంకర్ (29)... బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ కుటుంబానికి ఆసగా ఉంటున్నాడు. సొంతూరులో జాతర ఉండడంతో గురువారం వేకువజామున బెంగళూరు నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. తెల్లవారుజామున చింతామణి సమీపంలోకి చేరుకోగానే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై చింతామణి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.